# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 09 అక్టోబరు , 2026 | పేజీలు : 7


## వేగంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులు



**ప్రజాపక్షం/నల్లగొండ :** నియోజకవర్గంలోని ఎస్ఎల్బీసీ వద్ద చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.గురువారం ఆయన పాఠశాల నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఒప్పందం ప్రకారం 2027 ఏప్రిల్‌లోగా పనులు పూర్తి చేసి అప్పగించాల్సి ఉందని, అందువల్ల అన్ని పనులను వేగవంతం చేయాలని, ప్రస్తుతం చేస్తున్న పనికి అదనంగా క్యూబిక్ మీటర్ల పనిని పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు.నిర్మాణ పనుల నాణ్యతను కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఈడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఇంజనీర్ శివకుమార్,ఏఈఈ కిరణ్ కుమార్, ప్రాజెక్ట్ మేనేజర్ మురళీధర్ రెడ్డిలతో మాట్లాడుతూ నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని, జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు.తనిఖీలో సైట్ ఇంజనీర్లు అఖిల్ రెడ్డి, శేఖర్ తదితరులు ఉన్నారు.

# ఎస్ఎల్‌బిసి పూర్తయితే వలసలకు అడ్డుకట్ట...




### ఎన్నో ఏళ్లుగా ఎదురుచూపులు... పనులు మళ్లీ కొనసాగుతుండడంతో రైతుల్లో ఆశలు

**ప్రజాపక్షం/చందంపేట:** ఎన్నో సంవత్సరాలుగా నిలిచిపోయిన ఎస్ఎల్‌బిసి సొరంగం పనులు ప్రస్తుతం కొనసాగుతుండడంతో చందంపేట మండల రైతుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎస్ఎల్‌బిసి పూర్తయి సాగునీరు అందుబాటులోకి వస్తే మండలంలోని సాగుభూములకు నీటి సౌకర్యం కలగడంతో పాటు ఏళ్లుగా కొనసాగతున్న వలసలకు కూడా అడ్డుకట్ట పడుతుందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. సాగునీటి వసతి లేకపోవడంతో చందంపేట మండలంలో రైతులు ప్రధానంగా వర్షాధార పంటల పైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు సరిగ్గా లేకపోతే పంటలు దెబ్బతినడం, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు ఉపాధి లేకపోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా వేసవి కాలం వచ్చిందంటే మండలంలోని అనేక గ్రామాల నుండి కూలీలు మూడు నాలుగు నెలల పాటు ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలస వెళ్లాల్సివస్తోంది. కొంత మంది రైతులు, గొర్రెల పెంపకందారులు పశువులు, గొర్రెలను వెంట తీసుకొని ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు వెళ్లి జీవనం సాగిస్తున్నారు. మరికొందరు ఉపాధి కోసం హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్ళాల్సిన పరిస్థితి ఎర్పడుతోందని దీంతో గ్రామాల్లో కుటుంబాలు విడిపోవడం, పిల్లల చదువులకు ఇబ్బందులు కలగడం వంటి సమస్యలు



ఎదురవుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

**సాగునీరు వస్తే పరిస్థితి మారే అవకాశం....**ఎస్ఎల్‌బిసి పనులు పూర్తయి నీరు అందుబాటులోకి వస్తే వ్యవసాయానికి ఎంతో మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు. సాగునీటి ఆధారంగా పంటల విస్తీర్ణం పెరగడంతో పాటు వ్యవసాయ అనుబంధ రంగాలు అభివృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. స్థానికంగా వ్యవసాయ పనులు, పశుపోషణ, ఇతర ఉపాధి అవకాశాలు పెరిగితే ప్రతి సంవత్సరం వలస వెళ్ళాల్సిన పరిస్థితి కూడా తగ్గుతుందని ఆశిస్తున్నారు.

**పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి...**ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న ఎస్ఎల్‌బిసి పనులు ప్రస్తుతం తిరిగి కొనసాగుతుండడం సంతోషకరమైన విషయమని రైతులు అంటున్నారు. ప్రభుత్వం ప్రకటించిన లక్ష్యానికి అనుగుణంగా పనులను మరింత వేగవంతం చేసి, ఎప్పటికప్పుడు పురోగతిని ప్రజలకు తెలియజేయాలని కోరుతున్నారు. ఎస్ఎల్‌బిసి పూర్తియి సాగునీరు అందితే చందంపేట మండలంలోని రైతుల పరిస్థితి మెరుగుపడడంతో పాటు వలసలకు కూడా శాశ్వత పరిష్కారం లభించే అవకాశం ఉందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**2028 నాటికి ఎస్ఎల్‌బిసి పూర్తి చేస్తాం...** దేవరకొండ ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ ఎస్ఎల్‌బిసి ప్రాజెక్టును 2028 లోపు పూర్తి చేసి దేవరకొండ నియోజకవర్గ రైతుల సాగునీటి కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎంఎల్‌ఏ బాలునాయక్ అన్నారు. ఎన్నో ఏళ్లుగా సాగునీటి కోసం ఎదురుచూస్తున్న రైతులకు త్వరలో మంచి రోజులు రానున్నాయని తెలిపారు. గత పదేళ్లలో ప్రాజెక్టు పనులు ముందుకు సాగకపోవడంతో జాప్యం జరిగిందని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాజెక్టును పూర్తి చేసి దేవరకొండ రైతులకు నీరందిస్తామని హామీ ఇచ్చారని ఎంఎల్‌ఏ బాలునాయక్ పేర్కొన్నారు.

# మండలంలో జోరుగా ఇసుక అక్రమ రవాణా



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక అక్రమ రవాణా జోరుగా కొనసాగుతుంది. వల్లాపురం సరిహద్దులో ఉన్న పాలేరు వాగు నుండి అనంతగిరి మండలానికి చెందిన చనుపల్లి, జక్కేపల్లి, పాలవరం గ్రామాలకు చెందిన ట్రాక్టర్ యాజమానులు వారి ట్రాక్టర్లతో రాత్రి సమయంలో, తెల్లవారుజామున వల్లాపురం, సిరిపురం, శ్రీరంగాపురం, రామాపురం గ్రామాలకు ఇసుక అక్రమ రవాణా యదేచ్ఛగా కొనసాగిస్తున్నారు. గత కొంతకాలంగా మండలంలోని పలు గ్రామాల్లో మద్యవర్తుల ద్వారా ఇసుక వ్యాపారం కొనసాగుతుందని విశ్వసనీయ సమాచారం. ఒక ట్రక్కు ఇసుక 4వేల నుండి 5వేల వరకు మద్యవర్తుల ద్వారా రేటు మాట్లాడుకుని రాత్రిసమయంలో ఇసుక రవాణా జరుగుతుంది. దీనికి మద్యవర్తులకు ఇసుక ట్రాక్టర్ యాజమాని కొంత కమిషన్ ఇసుక విక్రయించి వారి దగ్గర నుండి కమిషన్ తీసుకుని ఇసుక దందా కొనసాగుతుందని తెలిపారు. ఇంత జరుగుతున్న అధికారులు తమకు పట్టనట్టు చోద్యం చూస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఇసుక నాణ్యతను బట్టి ఒక్కొక్క సారి ట్రక్కు 6వేలు, 7వేల వరకు రేటు చెబుతున్నారని కొనుగోలు దారులు తెలిపారు. అనంతగిరి మండల పరిధిలోని చనుపల్లి, జక్కపల్లి, పాలారం గ్రామాల్లో పాలేరు వాగు నుండి ఇసుక తవ్వకాలు జరిపి వారి ఇండ్లలో ఖాళీ స్థలాలలో ఇసుక పెద్దమొత్తంలో డంప్ చేసి మద్యవర్తి ద్వారా సమాచారం తెలుసుకుని అడ్డుఅదుపు లేకుండా రాత్రి వేళలో ఇసుక అక్రమ రవాణా జోరుగా జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. నెలల పాటు ప్రతిరోజు నాలుగు, ఐదు ట్రాక్టర్లు అదే పనిగా ఇసుక అక్రమ రవాణా చేస్తున్న అధికారులు చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ప్రజలు వేడుకుంటున్నారు.

# బంగారం రికవరీలో పక్కదారి ఎవరిది?

### నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కలకలం.. ఎస్ఐపై వేటుతో మరింత బలపడుతున్న అనుమానాలు

### నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారంలో కొంత మాయమైందా?

### ఎస్ఐ పాత్రేనా..పై అధికారుల పాత్ర కూడా ఉందా?



**ప్రజాపక్షం/నల్లగొండ :** నార్కట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న బంగారం రికవరీ వ్యవహారం ఉమ్మడి నల్లగొండ జిల్లా పోలీస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది.దొంగతనం కేసులో నిందితుడి నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారంలో కొంత పక్కదారి పట్టిందనే ఆరోపణలు తాజాగా కలకలం రేపుతున్నాయి.ఈ వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న నార్కట్‌పల్లి ఎస్ఐ విష్ణుమూర్తిని జిల్లా ఎస్పి కార్యాలయానికి అటాచ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం.అయితే,బంగారం రికవరీ వ్యవహారం పూర్తిగా ఎస్ఐ స్థాయిలోనే జరిగిందాలేక ఇందులో పైస్థాయి అధికారుల పాత్ర కూడా ఉందా అన్న అనుమానాలు ఇప్పుడు పోలీస్ శాఖలోనే వ్యక్తమవుతున్నాయి.

**చేసింది ఎస్ఐ ఒక్కరేనా?**

నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారం మొత్తం ఎం? పోలీస్ రికార్డుల్లో ఎంత చూపించారు? వాస్తవంగా రికవరీ చేసిన బంగారం ఎంత ప్రస్తుతం పోలీసుల వద్ద ఎంత ఉంది.అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. పంచనామా,కేసు రికార్డులు,రికవరీ వివరాలు,బంగారం అప్పగింతకు సంబంధించిన నమోదులను సమగ్రంగా పరిశీలిస్తే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**పై అధికారుల పాత్రపై ఎందుకు అనుమానాలు?**

ఈ వ్యవహారంలో మరో పోలీస్ అధికారిపై కూడా ఆరోపణలు ఉన్నాయన్న ప్రచారం జరుగుతున్నప్పటికీ,ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై పోలీస్ వర్గాల్లోనే విమర్శలు వినిపిస్తున్నాయి.కీలక పోలీస్ అధికారితో ఉన్న సాన్నిహిత్యం కారణంగానే సదరు అధికారికి రక్షణ లభిస్తోందన్న ప్రచారం కూడా జరుగుతోంది. అయితే ఈఆరోపణలకు అధికారికంగా ఎలాంటి ధృవీకరణ లేదు.

**నిష్పక్షపాత విచారణకు డిమాండ్**

ఎస్ఐను అటాచ్ చేయడంతోనే వ్యవహారం ముగిసిపోయిందా లేక రికవరీలో వాస్తవంగా ఏం జరిగిందో తేల్చేందుకు సమగ్ర విచారణ జరుగుతుందా? అన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. బంగారం రికవరీలో ఎవరెవరి పాత్ర ఉందన్న అంశాన్ని ఉన్నతాధికారులు నిష్పక్షపాతంగా విచారించి,తప్పు చేసిన వారు ఎవరైనా కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.ఎస్ఐపై చర్యలతో పాటు పైస్థాయి అధికారుల పాత్రపైనా విచారణ జరిపితేనే అసలు నిజం బయటపడుతుందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.దీంతో నార్కట్‌పల్లి బంగారం రికవరీ వ్యవహారంలో తదుపరి పోలీస్ శాఖ చర్యలపై ఉత్కంఠ నెలకొంది.

## కృత్రిమ కొరత సృష్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/చిట్యాల:** ఎల్‌నినో ప్రభావం సాకుగా చూపి బియ్యానికి కృత్రిమ కొరత సృష్టిస్తూ, అనుమతులు లేకుండా నిల్వలు దాచి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్న రైస్ మిల్లర్లు, వ్యాపారులపై ప్రభుత్వం తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలన తెలంగాణ మలిదశ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కూనూరు సంజయ్‌దాస్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గత కొద్ది రోజులుగా బియ్యం ధరలు పెరిగిపోయాయని, సాధారణ ప్రజలు నిత్యావసర సరకు అయిన బియ్యాన్ని కొనలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. బియ్యం నిల్వలు ఉన్న దుకాణాలపై అధికారులు దాడులు నిర్వహించి కృత్రిమ కొరతను నివారించాలని సంజయ్‌దాస్ కోరారు.

## టిబి రహిత గ్రామంగా బోయగుబ్బ



**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండలం బోయగుబ్బ గ్రామ పంచాయతీ టిబి రహిత గ్రామంగా గుర్తింపు పొందింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం రోజున నిర్వహించిన ఒక కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రేగులగడ్డ స్వామి జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ నుండి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. గ్రామంలో టిబి వ్యాధి నివారణ, అవగాహన కార్యక్రమాలు, ప్రజల ఆరోగ్య పరిరక్షణకు చేపట్టిన చర్యలకు గాను ఈ గౌరవం లభించినట్లు సర్పంచ్ స్వామి తెలిపారు. బోయగుబ్బకు గుర్తింపు రావడం గ్రామ ప్రజలకు ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.

## ఇళ్ల మంజూరి పత్రాలు పంపిణీ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ ధ్యేయమని గరిడేపల్లి మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ చాంద్‌మియా అన్నారు. రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అదేశాల మేరకు గురువార మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు పంపిణీ చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి మంజూరైన 70 ఇళ్లలో భాగంగా మొదటి విడతగా 33 మందికి పట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన 37 మందికి త్వరలో పట్టాలు పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి జానకమ్మ, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు కీత సోమయ్య, ఉప సర్పంచ్ చిత్తలూరి వీరస్వామి, బండారు సైదులు, బండారు అంజయ్య, గుండు అజయ్, ఎస్‌కె సఫియా మీరా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## విద్యుత్ కోతలతో ఎండుతున్న వరి పంటలను కాపాడాలి




**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** విద్యుత్ కోతలతో ఎండుతున్న వరి పంటలను కాపాడాలని సిపిఐ రాష్ట్ర కమిటి సభ్యుడు దూళిపాళ ధనుంజయనాయుడు అన్నారు. గురువారం నేరేడుచర్ల ట్రాన్స్‌కో ఎఈ కార్యాలయం ముందు సిపిఐ రైతు సంఘం ఆధ్వర్యంలో తీవ్రమైన విద్యుత్ కోతలను నిరసిస్తూ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు రైతులకు విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వరి కంకులు పాలు పోసుకుంటున్న సమయంలో విద్యుత్ సరఫరా లేక వరి పంటకు అవసరమైన నీరు అందక మొత్తం తాలుగా మారే ప్రమాదం ఉందన్నారు. వ్యవసాయ అధికారుల చేత సర్వేచ ఏయించి ప్రస్తుతం రైతాంగం అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా ప్రభుత్వం విద్యుత్ అధికారులు రైతులకు ఇబ్బంది లేకుండా వారికి అవసరమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కత్తి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు రావుల సత్యం, చిలకరాజు శ్రీను, కొమ్రాజు వెంకట్, పరికె భరత్, కటికొల వెంకన్న, బెల్లంకొండ గోవిందు, సోమగాని వెంకటేశ్వర్లు, బండి సాంబయ్య, సోమగాని పురుషోత్తం, శీలం రాంబాబు, కన్నా బిక్షం, ఎస్‌కె సయ్యద్ , బత్తిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రభుత్వం అందించే చేయూత ప్రయోజకులు కావాలి

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రభుత్వం అందిస్తున్న చేయూతతో విద్యార్థులు ప్రయోజకులు కావాలని సూర్యాపేట జిల్లా ఇంటర్ విద్యాధికారి సులోచన రాణి అన్నారు. గురువారం నేరేడుచర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ నీరజ అధ్యక్షతన విద్యార్థులకు ఏకరూప దుస్తులు, కళాశాల బ్యాగులు, బెల్టు, ఐడికార్డులు, షూష్ లు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఇంటర్ విద్యను ప్రైవేటుకు ధీటుగా ముందుకు తీసుకపోతూ పేద, మద్య తరగతి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో ఎన్నో మార్పులను చేస్తూ అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం గర్వకారణమన్నారు. కళాశాలలో అన్ని వసతులు, సౌకర్యాలు ఇప్పటికే కల్పించిందన్నారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులతో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. ఆటపాటలతో విద్యార్థులు, అధ్యాపకురాలు అలరింపజేశారు. హుజూర్‌నగర్ ప్రిన్సిపాల్ గీత బాయి, కళాశాల అధ్యాపకులు వెంకటరమణ, సైదులు, ప్రణతి, కెవిఎల్ఎన్‌రావు, వెంకన్న, శ్రీనివాసులు, సునిత, ప్రసాద్, అంజయ్య, నర్సింహచారి, గణేష్, వీరు, వెన్నెల, జానకిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.



## సమస్య పరిష్కరించకపోతే ఉద్యమం తప్పదు



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా చేస్తున్నామని రైతులను మోసం చేస్తుందని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గురువారం చిలుకూరు మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌ను సందర్శించి లాక్ బుక్‌ను పరిశీలించి, ఎన్ని గంటలకు విద్యుత్ సరఫరా చేస్తున్నారో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులకు సాగునీరు అందించడంల విద్యుత్ కీలకపాత్ర పోషిస్తుందని, సరైన సమయంలో విద్యుత్ అందకపోతే నష్టపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్‌ను సక్రమంగా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందనిస్పష్టం చేశారు. రైతులకు సరిపడా విద్యుత్ ఇవ్వలేని చేతగాని ప్రభుత్వమని విమర్శించారు. రైతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం మొండి వైఖరితో వ్యవహరించడం సరికాదన్నారు. విద్యుత్ సరఫరాపై ప్రభుత్వం చేస్తున్న ప్రకటనలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో కూడా పరిస్థితులు ఉండాలని పేర్కొన్నారు.

## ఆర్థికంగా రాణించాలి

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** నిరుద్యోగ యువత స్వయం ఉపాధితో ఆర్థికంగా రాణించాలని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిషోర్ కుమార్ అన్నారు. గురువారం తుంగతుర్తి మండల కేంద్రంలోని బిఆర్ఎస్ నియోజక వర్గ నాయకులు తడకమళ్ళ రవి కుమార్ ఇటీవల ఏర్పాటు చేసిన రాయల్ చైనీస్ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం పోటీపడుతూనే ప్రత్యామ్నాయంగా వివిధ వ్యాపారాల్లో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాటికొండ సీతయ్య, నాయకులు గుండగాని రాములు గౌడ్, కేతిరెడ్డి గోపాల్ రెడ్డి, తునికి సాయిల్ గౌడ్, గుండగాని దుర్గయ్య, కొండగడుపుల నాగయ్య పాల్గొన్నారు.



## ఘనంగా శ్రీపార్వతి పరమేశ్వరుల కల్యాణం

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** మాస శివరాత్రిని పురస్కరించుకొని సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీసంతోషి మాత దేవాలయంలో గురువారం శ్రీపార్వతి పరమేశ్వరుల కళ్యాణాన్ని దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్వతి, గంగాదేవి శివుడు, చండీశ్వరుడు ఉత్సవ విగ్రహాలకు నూతన వస్త్రములు అలంకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై శాస్త్రోక్తంగా కళ్యాణ తంతు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటి సభ్యులు బ్రాహ్మణపల్లి మురళీధర్, పబ్బా ప్రకాశ రావు, కొత్త మల్లికార్జున్, సోమా శ్రీశైలం, బ్రాహ్మణపల్లి బాలచంద్రుడు, దేవరశెట్టి సోమయ్య పాల్గొన్నారు.

## చేయూత పెన్షన్ దరఖాస్తుల క్షేత్రస్థాయి వెరిఫికేషన్ వేగవంతం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండల పరిధిలోని అవంతిపురం గ్రామంలో ఇటీవల వివిధ రకాల చేయూత పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల దరఖాస్తులను అధికారులు గురువారం క్షేత్రస్థాయిలో సమగ్రంగా వెరిఫికేషన్ చేశారు. డీఎమ్ఎల్ఓ, ఎంఎస్ఓ జూలకంటి వెంకట్ రెడ్డి గ్రామానికి విచ్చేసి ప్రత్యేక యాప్ ద్వారా శాంపిల్‌గా ఎంపికైన ఆరు దరఖాస్తులను నిశితంగా పరిశీలించారు. లబ్ధిదారుల ఇళ్లకు నేరుగా వెళ్లి వారి అర్హతలు, నివాస వివరాలు, సమర్పించిన ధ్రువపత్రాలను యాప్‌లో నమోదు చేసిన వివరాలతో సరిపోల్చి క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలు అర్హులైన పేదలకు మాత్రమే అందాలనే లక్ష్యంతో ఈ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి మాతంగి రమేష్, ఇన్‌చార్జ్ పంచాయతీ కార్యదర్శి అక్కి నరసింహస్వామి, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

## హక్కుల పరిరక్షణకు ఉద్యమాలు ఉధృతం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కుల వివక్షతకు వ్యతిరేకంగా, దళితులు, గిరిజనులు, పేద వర్గాల హక్కుల పరిరక్షణకు ఉద్యమాలను ఉధృతం చేయాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కోడిరెక్క మల్లయ్య పిలుపునిచ్చారు. కెవిపిఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం జెండా ఆవిష్కరించి మాట్లాడారు. సంక్షేమ హాస్టళ్లకు నిధులు కేటాయించి విద్యార్థుల హక్కులను కాపాడాలన్నారు. నేటికీ కులం పేరుతో దాడులు కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై దాడులు జరగడం హేయమైన చర్య అన్నారు. ఎస్సీ, ఎస్టి సబ్ ప్లాన్ కింద నిధులు కేటాయింపు, దళితులకు స్మశాన వాటికలకు భూమి కేటాయింపు వంటి అంశాల్లో సంఘం పోరాటాలు కీలకపాత్ర పోషించాయని గుర్తు చేశారు. నిరుద్యోగం పెరిగి యువతకు ఉపాధి అవకాశాలు లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కుల వివక్షతకు తోడుగా పేదరికం. నిరుద్యోగం దళితుల జీవితాలు దుర్భరంగా మారాయని వాపోయారు. చదువు ద్వారానే విజ్ఞానం, సామాజిక చైతన్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు దైద దేవయ్య, బొంగరాల వెంకటయ్య, పాపారావు, రాము, కోటయ్య, సైదులు, జయరాజు పాల్గొన్నారు

## సూర్యాపేటను కరువు జిల్లాగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** జిల్లాలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా సూర్యాపేట జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి, కరువు సహాయక చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో రైతులు ఎంతో ఆశతో సాగు చేసిన వరి పంటలకు అవసరమైన సమయంలో నీరు, విద్యుత్ అందక పొలాల్లోనే పంటలు ఎండిపోతున్నాయన్నారు. కరువు పరిస్థితులపై ప్రభుత్వం తక్షణమే స్పందించకపోతే రైతులు, వ్యవసాయ కార్మికులు, ప్రజలను సమీకరించి పెద్దఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపెల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ధి ఉత్సవాలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతన జిల్లాలు ఏర్పడి ఈనెల 10కి దశాబ్ద కాలం పూర్తవుతున్న సందర్భంగా సూర్యాపేట జిల్లాలో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో దశాబ్ధి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు మాజీ రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో ఈనెల 10న ఉదయం 6 గంటలకు సద్దల చెరువు బతుకమ్మ ఘాట్ నుంచి కొత్తబస్టాండ్ వరకు 2 కె రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ రన్‌లో సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలకు చెందిన ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, అన్ని వర్గాల ప్రజలు, అభిమానులు పెద్దఎత్తున టీ షర్టులు ధరించి పాల్గొనాలని కోరారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** మండల కేంద్రానికి చెందిన దిగోజు రాజు ఇటీవల మృతి చెందడంతో, వారి కుటుంబాన్ని పరామర్శించి కుటుంబానికి రూ.7,500 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దిగోజు నరసింహ చారి, బీసీ సెల్ పట్టణ అధ్యక్షులు ఉగ్గె నరేష్, బూత్ అధ్యక్షులు ఎస్.కె మజీద్, దిగోజు వీరచారి, కట్టెకోల సత్యనారాయణ యువజన కాంగ్రెస్ నాయకులు నార బోయిన రాజు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు గట్టు రాజు, దిగోజు సురేంద్ర చారి గట్టు మహేష్, ఎలగందుల మచ్చ గిరి, మామిడి మహేందర్ రెడ్డి, నాగం నర్సిరెడ్డి, మురారి శెట్టి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## క్షయ వ్యాధిపై అవగాహన



**ప్రజాపక్షం/అర్వపల్లి :** క్షయ వ్యాధి లక్షణాలు చికిత్స నివారణ గురించి ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండా లని సిహెచ్ఓ బిచ్చు నాయక్ అన్నారు. గురువారం మండలంలోని జాజిరెడ్డిగూడెంలో 20 మందికి క్షయ వ్యాధి పరీక్షలను నిర్వహించి అనంతరం మాట్లాడారు. క్షయ వ్యాధి ఉన్న ఎటువంటి అనుమానాలు ఏర్పడిన స్థానిక ఆశ వర్కర్లను ఆరోగ్య సిబ్బందిని కలిసి పరీక్షలు నిర్వహించుకుని మందులు వాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ లలిత, టిబి మోడల్ పర్సన్ కుంభం వీరయ్య, హెల్త్ అసిస్టెంట్ శకుంతల, గ్రామ పంచాయితీ కార్యదర్శి అశోక్ నాగయ్య, ఆశా కార్యకర్తలు నాగమ్మ, సైదమ్మ, పద్మ పాల్గొన్నారు.

## బుల్లెట్ ట్రైన్ తరలింపు కుట్రలను తిప్పికొట్టాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** బుల్లెట్ ట్రైన్ తరలింపు కుట్రలను తిప్పి కొట్టాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్ కుమార్ అన్నారు. గురు వారం జిల్లా కేంద్రంలోని రైతుబజార్ అంబేద్కర్ విగ్రహం వద్ద బుల్లెట్ ట్రైన్ సాధన కమిటి ఆధ్వర్యంలో 56వ రోజు దీక్షలో కూర్చొని మాట్లాడారు. బుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి 65 సూర్యాపేట మీదుగా వెళ్లే విధంగా తీర్మాణాలు చేయించి పక్కదోవ పట్టకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా చల్ల మల్ల నర్సింహ, వెలుగు వనిత, సట్టు నాగయ్య, మల్లికా ర్జున్, శోభ, నర్సయ్య, మాధవరెడ్డిలు మద్ధతు తెలిపారు. ఈ కార్యక్రమంలో కునుకుంట్ల సైదులు, నాగయ్య, దుర్గయ్య, నర్సిరెడ్డి, సింహాద్రి, నర్సక్క పాల్గొన్నారు.

## పోషణ మాసం

**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో సీడీపీఓ వెంకటరమణ అధ్యక్షతన గురువారం పోషణ మాసం కార్యక్రమం నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి మండల తహసిల్దార్ లాల్ బహదూర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సంద ర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గర్భిణీలకు 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించి, అనంతరం గర్భిణి లకు శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎసిడిపిఓ పారిజాత, మెడికల్ హెచ్ఈఓ గోపాల్, సూపర్ వైజర్లు, పోషణ్ అభియాన్ బీసీ, అంగన్వాడీ టీచర్లు మరియు గర్భిణిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వాములు కావాలి




**ప్రజాపక్షం/నాంపల్లి:** ఉపాధ్యాయులు పోరాట స్ఫూర్తిని పెంచుకుని తమ సమస్యల పరిష్కారం కోసం ప్రత్యక్ష పోరాటాల్లో భాగస్వాములు కావా లని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం పిలుపునిచ్చారు. టిఎస్‌యుటిఎఫ్ మండల 13వ మహాసభ గురు వారం మండల కేంద్రంలోని మండల పరిషత్ పాఠ శాలలో ఘనంగా నిర్వహించారు.ముఖ్య అతిథిగా ఆయన హాజరైన మాట్లాడుతూ సంఘానికి హక్కులు, బాధ్యతలు రెండు నేత్రాల వంటివని అన్నారు. పీఆర్‌సి నివేదికను తక్షణమే అమలు చేయాలని,మిగిలిన డీఏలను సాధించాలని, సీపీఎ స్‌ను రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను పూర్తిగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వాట్సాప్‌లో నిరస నలు తెలిపే పద్ధతిని వీడి ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలని సూచించారు. పాఠశాలల బలో పేతం, విద్యార్థుల నమోదు పెంపు కోసం ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని కోరారు.జిల్లా ఉపాధ్యక్షుడు నర్ర శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపా ధ్యాయుల సమస్యల పరిష్కారానికే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతతో పనిచేస్తోందన్నా రు. మండల అధ్యక్షుడు జింకల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన మహాసభలోమండల ప్రధాన కార్యదర్శి కస్పరాజు వెంకన్న,కోశాధికారి ఆర్.శ్రవ ణ్‌కుమార్,బి.యాదయ్య గేర నరసింహ జనా ర్దన్,వెంకటేశ్వర్లు, దీవంత,శంకరయ్య, సంపత్, స్వరూప, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల వల్ల అనేక ప్రయోజనాలు



**ప్రజాపక్షం/బొమ్మలరామారం :** తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల రేషన్ సరుకులతో పాటు అనేక ప్రజా ప్రభుత్వ ఉపయోగాలకు గుర్తింపు కార్డుల పని చేస్తుందని బొమ్మలరామారం తహసీల్దార్ పి.రాధ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా స్మార్ట్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా గురు వారం బొమ్మలరామారం మండల కేంద్రంలో చౌక ధరల దుకాణం షాప్ నెంబర్ 11 ద్వారా లబ్ధిదారు లకు 913 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమా నికి తహసిల్దార్ ముఖ్య అతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రతి ఒక్క రేషన్ కార్డు లబ్ధిదా రులు తీసుకొని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో బొమ్మలరామారం గ్రామ సర్పంచ్ కట్ట ఉమాదేవి శ్రీకాంత్ గౌడ్, కాజీ పేట సర్పంచ్ పల్లెపాటి రాములు, ఎంపీడీవో శ్యామల స్థానిక ఎస్సై బుగ్గ శ్రీశైలంతో పాటు ఉప సర్పంచ్ ఎలబోయిన జంగయ్య పాల్గొన్నారు.

## రామన్నపేట కోర్టు ఆవరణలో నిరసన



**ప్రజాపక్షం/రామన్నపేట :** ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షులు,సీని యర్ న్యాయవాది బికాష్ రంజన్ భట్టాచార్య కోల్క తాలోని నివాసంపై గురువారం తెల్లవారుజామున దుండగులు దాడి చేసి, కిటికీ అద్దాలనుపగులగొట్టి, సీసీటీవీ కెమెరాను ధ్వంసం చేయడాన్ని నిరసిస్తూ రామన్నపేటలో న్యాయవాదులను నిరసన కార్య క్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఐలు రాష్ట్ర ఉపా ధ్యక్షులు మామిడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా స్వామ్య పరిరక్షణ కోసం, ప్రధాన ఎన్నికల కమిష నర్ నిరంకుశ చర్యలకు, సర్ ప్రక్రియకు వ్యతిరే కంగా నిరంతరం పోరాడుతున్న భట్టాచార్యను భయభ్రాంతులకు గురిచేసేందుకే ఈ దాడి జరిగిం దన్నారు. బీజేపీఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్నట్లు ఆరోప ణలు ఎదుర్కొంటున్న దుండగుల ఈ చర్యను ఖండిస్తూ, దాడికి పాల్పడిన వారిని,ప్రేరేపించిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది. ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు పాల్వంచ జగతయ్య, జిల్లా కమిటీ సభ్యులు యాదాసు యాదయ్య, ఎండి ఖయ్యూం, గడ్డం నరసింహ, రమేష్, తాటిపాముల కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీకుమార్ నిన్ను మరువదు కోదాడ



**ప్రజాపక్షం/కోదాడ:** కోదాడ గర్వంగా గుర్తించుకో తగిన ప్రగతిశీల రచయిత శ్రీశ్రీ కుమార్ (శ్రీరామక వచం శ్రీనివాసకుమార్) ను ఈనెల మరువదని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరిశంకర్ అన్నారు. శ్రీశ్రీకుమార్ వ్యక్తికి అంకితమైన అధ్యాపకుడు, తెలంగాణ అస్తి త్వాన్ని కాపాడేందుకు కలంబట్టిన రచయితని కొని యాడారు. గురువారం కోదాడలో శ్రీశ్రీకుమార్ సంస్మరణ సభ అధ్యాపకులు, స్నేహితులు, మిత్రులు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా జూలూరు మాట్లాడుతూ పుట్టుక నీది, చావు నీది, బతుకంతా దేశానిది అని చాటి నిలిచిన వాళ్లని రేప టితరం గుర్తుంచుకుంటుందని తెలిపారు. శ్రీశ్రీకు మార్ మంచి అనువాదకుడని ప్రపంచానికి పరిచ యమ్యే సమయంలో ఈ లోకాన్ని విడిచి వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు సాహిత్యంలోనే అతిపెద్ద దీర్ఘ కవితను శ్రీశ్రీకుమార్ ఆంగ్లంలోకి అనువదించారని, అది త్వరలో వెలుగులోకి రాబో తుందన్నారు. శ్రీశ్రీకుమార్ రాసిన రచనలన్నింటిని పుస్తకాలుగా తేవడమే ఆయనకు ఇచ్చే నివాళి అవు తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చక్రవర్తి, శ్రీశ్రీకుమార్ తండ్రి శ్రీరామ కవచం వెంకటేశ్వర్లు, బట్టు రమేష్, డాక్టర్ జాస్తి సుబ్బారావు, డాక్టర్ అందె సత్యం, అప్పారావు, రవిచంద్ర, కేలోజు రమేష్, పసుపులేటి విద్యాసాగర్, రాయపూడి చిన్ని, సుబ్రమణ్యం, అర్వపల్లి శంకర్, పాకనాటి రాఘవరెడ్డి పాల్గొన్నారు.




## ‘డైనమిక్ స్కూల్’ అవార్డ్

**ప్రజాపక్షం/బీబీనగర్ :** ఎడ్యుకేషన్ న్యూస్ నెట్వర్క్ నిర్వహించిన సౌత్ ఇండియా ఎడ్యుకేషన్ సమ్మిట్లో కిడ్స్ కింగ్డమ్ గ్రామర్ హైస్కూల్‌కు ‘డైనమిక్ స్కూల్’ అవార్డు లభించింది. ఈ అవార్డును పాఠశాల కరస్పాండెంట్ కె.వి.మధుసూదన్‌రెడ్డి అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 34 సంవత్సరాలుగా పాఠశాలను నిర్వహిస్తూ, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేస్తున్న ఉపాధ్యాయ బృందానికి ఈ అవార్డు గర్వకారణమన్నారు. ఈ అవార్డు తమపై మరింత బాధ్యతను పెంచిందని తెలిపారు. ఇకముందు కూడా విద్యార్థులను సమాజంలో ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాహుల్ ఎడ్యుకేషన్ సొసైటీ డైరెక్టర్ జి.నాగలక్ష్మి, ప్రిన్సిపాల్ బీఎస్ఎన్ రాజు, హెడ్మాస్టర్ భవాని, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు తదితరులు పాల్గొన్నారు.

## నేల ఆరోగ్యమే మన ఆరోగ్యం



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మారుతున్న కాలానికి అనుగుణంగా పంటల సాగులో జీవామృతం వాడితే భూసారం పెరుగుతుందని సిరి ఫౌండేషన్ వ్యవస్థాపకులు మొలుగూరి గోపయ్య (గోపి) అన్నారు. కోదాడ పట్టణంలోని పిఎం శ్రీ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో సిజిఆర్ (కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్), వైఈ ఎల్పి (యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రాం) ఆధ్వర్యంలో విద్యార్థులకు జీవామృతం తయారీ విధానంపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 60 ఏళ్లుగా రసాయనిక వ్యవసాయం వల్ల నేలలో సారం తగ్గిపోయిందని, భూమి మళ్లీ పున ర్జీవం సాధించాలంటే తక్కువ ఖర్చుతో కూడిన జీవామృతం వాడా లన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి ఎల్. దేవరాజు, ఉపాధ్యాయులు బడుగుల సైదులు, ఎం. చిన్నప్ప, వి. శ్రీనివాస రావు, యంగ్ ఎర్త్ లీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉచిత షూస్, సాక్స్ పంపిణీ



**ప్రజాపక్షం/ రామన్నపేట :** మండల పరిధిలోని నీర్నేముల ఎంపియుపిఎస్ పాఠశాలలో ప్రభుత్వం అందజేసిన ఉచిత షూస్, సాక్సను గురువారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు యన్.రవి విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఏఏపిసి చైర్మన్ పాల్గొన్నారు.

## అర్హులకే పెన్షన్స్ మంజూరు

**ప్రజాపక్షం/మోతె :** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం పెన్షన్స్ మంజూరు చేస్తుందని జడ్పి సిఇఓ శిరీష అన్నారు. గురువారం మండలంలోని రాఘవాపురం, నామవరం గ్రామాల్లో పెన్షన్స్‌కు దరఖాస్తు చేసిన లబ్ధిదారుల పించన్లను వెరిఫికేషన్ చేశారు. అనం తరం విబిజి రాంజీలో రాఘవాపురంలో జరుగుతున్న ఫారం పాండు పనిని పరిశీలించి కూలీలకు తగు సూచనలు ఇచ్చారు. కొలతల ప్రకారం పనిచేయాలని పనికి తగ్గట్టుగా వేతనం వస్తుందని తెలిపారు. ఫారం పనులు ఎక్కువ మంది రైతులు తమ పొలంలో తొవ్వించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ సందీప్ కుమార్, ఏపిఓ నాగేష్, ఈసి డి. శ్రీహరి, పంచాయితీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



## పంటలను కాపాడాలి

**ప్రజాపక్షం/మునగాల:** రైతులు వేసిన పంటలను కాపాడుకోవడానికి సరిపడా విద్యుత్ ఇచ్చి ఎండిపోతున్న వరి పొలాలను కాపాడాలని సిపిఎం మండల కార్యదర్శి బుర్రి శ్రీరాములు అన్నారు. గురువారం మండల పరిధిలోని నర్సింహులగూడెం గ్రామానికి చెందిన రైతులతో కలిసి రేపాల సబ్‌స్టేషన్ ముందు ధర్నా నిర్వహించారు. అనధికార విద్యుత్ కోతల వల్ల రైతులు పొలాల వద్దనే పడిగాపులు కాయాల్సి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొగిలిచర్ల సీతరాములు, బొంత స్వరూప, విజయలక్ష్మి, కొండారెడ్డి, రమేష్, శివరాజు, ఖాసీంఅలీ, నాగరాజు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంపై తిరుగుబాటు మొదలైంది



**ప్రజాపక్షం/త్రిపురారం** :కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల నుండి తిరుగుబాటు మొదలైందని మాజీ ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్ అన్నారు. ఎమ్మెల్సీ ఓటుపై అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ నాయకులు బైరం కృష్ణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల ముఖ్య నాయకుల సమావేశం గురువారం మండల కేంద్రంలో నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసిన యువకులకు అందరికీ ఎమ్మెల్సీ ఓటు పై అవగాహన కల్పించేందుకు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలి అన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు బైరం కృష్ణ,వెంకన్న, కలకొండ వెంకటేశ్వర్లు,అనుముల సుధాకర్ రెడ్డి,అనుముల శ్రీనివాస్ రెడ్డి,అనుముల శ్యాంసుందర్ రెడ్డి,గోపు కోటిరెడ్డి పాల్గొన్నారు.

## నేరేడుచర్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రంగినేని స్పందన

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** వ్యవసాయ మార్కెట్ కమిటి నూతన పాలకవర్గాన్ని 17 మందితో జీవోఆర్ జి నెంబర్ 687 ద్వారా ప్రభుత్వం ఉత్తర్వులు జారి చేసింది. నూతన మార్కెట్ కమిటి చైర్మన్‌గా రంగినేని స్పందన, వైస్ చైర్మన్‌గా మునగాల బాస్కర్‌రెడ్డి, సభ్యులుగా నూరోజు రవీంద్రచారి, పోతురాజు జ్యోతి, బుర్రి వెంకటయ్య, రమావత్ వసియా, ధనావత్ సైదులు, ఉట్కూరి సైదులు, కర్ణం రామనర్సయ్య, పల్లె కాశయ్య, గడ్డం ప్రియాంక, కత్తి శ్రీనివాసరెడ్డి, పోలే విశ్వనాథం, రెబ్బ రమేష్ నియమితులయ్యారు. నూతన పాలకవర్గంలో చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు 12 మంది సభ్యులు, ముగ్గురు జిల్లా మార్కెటింగ్ అధికారి, సహయ వ్యవసాయ సంచారకులు, మున్సిపల్ చైర్మన్, అధికార సభ్యులుగా నియమితులయ్యారు. రైతుల ప్రయోజనాలను పరిరక్షించడం వ్యవసాయ ఉత్పత్తులకు మె రుగైన మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం, మార్కెట్ కమిటి అభివృద్ధికి కృషి చేయడం ప్రధాన లక్ష్యాలతో రెండేళ్లపాటు నూతన





# సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తా



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని నల్లగొండ నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి అన్నారు.గురువారం నల్లగొండ స్వాతంత్ర సమరయోధుల సంక్షేమ భవన్లో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ద్వితీయ వార్షికోత్సవ సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం భవన నిర్మాణం కోసం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.విశ్రాంత పోలీస్ అధికారులు కోరిన విధంగా వెల్నెస్ సెంటర్లో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.అనంతరం విశ్రాంత పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగర మేయర్ చైతన్య శ్రీనివాసరెడ్డిని,మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డిలను శాలువాలతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ఆలకుంట్ల ఝాన్సీ రాణి.గొల్లగూడ పిఏసిఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు,విశ్రాంత పోలీసు అధికారుల సంక్షేమ సంఘం నల్లగొండ జిల్లా అధ్యక్షులు గోలి లక్ష్మారెడ్డి,ఉపాధ్యక్షులు నాయిని జంగయ్య,గౌరవ అధ్యక్షులు ఎండి గౌస్ మహినుద్దీన్,ప్రధాన కార్యదర్శి ఎం డి ఆసద్ అలీ,పోలీస్ అధికారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు సట్టు సైదులు,ప్రధాన కార్యదర్శి సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# వెస్ట్ జోన్ ప్రీ-రిపబ్లిక్ డే పరేడ్ క్యాంప్ ఎంపికలు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొనే ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఎంపికను గురువారం ఎంజీయూలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి హాజరై మాట్లాడుతూ క్రమశిక్షణకు మారుపేరైన ఎన్ఎస్ఎస్ ద్వారా సామాజిక అంశాలపై అవగాహన, సమగ్ర వ్యక్తిత్వం,దేశభక్తిని పెంపొందించుకున్న ప్రతిభావంతులకు గణతంత్ర వేడుకల్లో పాల్గొనడం గొప్ప అవకాశం అని అన్నారు. ఇది విద్యార్థుల్లో స్ఫూర్తి,ఉత్సాహాన్ని కల్పించడంతో పాటు బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దే బృహత్తర కార్యక్రమమని అభివర్ణించారు. అనంతరం నషా ముక్త్ భారత్‌లో భాగంగా వాలంటీర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు.ఎంపిక ప్రక్రియలో భాగంగా బాలురకు 1200 మీటర్ల పరుగు, బాలికలకు 800 మీటర్ల పరుగు, డ్రిల్, పరేడ్, ఇంటర్వ్యూ, సాంస్కృతిక ప్రతిభ పరీక్షలు నిర్వహించారు. కోఆర్డినేటర్ రమణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పీఓ రమేష్ నాయక్,వివిధ కళాశాలల పీఓలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# షీ టీమ్ పట్ల అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం/రామన్నపేట** : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం, జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో షీ టీమ్ పట్ల అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో షీ టీమ్ ప్రతినిధులు రవీందర్ రెడ్డి, అశోక్ పాల్గొని మహిళల భద్రత, మహిళలపై వేధింపులను నివారించడం,అత్యవసర పరిస్థితుల్లో షీ టీమ్ను సంప్రదించే విధానం, అందుబాటులో ఉన్న సహాయ సేవలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఆర్.రత్న మంజుల మాట్లాడుతూ షీ టీమ్ మహిళలను చైతన్య పరచడానికి,సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యల్ని నివారించడానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ ఎం. అనిత, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారులు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ జి.సునీత, ఐక్యు ఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మి నీలిమ తోపాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జయవీర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్** : మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్థానిక శాసనసభ్యులు కుందూరు జయవీర్ రెడ్డి జన్మదిన వేడుకలు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జటావత్ లాలు నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బాలికలతో కలిసి కేక్ కటింగ్ చేసి, పాఠశాలలోని సుమారు 325 మంది బాలికలకు అన్నం ప్లేట్లు పంపిణీ చేశారు.కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఆంగోత్ శ్రీను నాయక్, సర్పంచులు పగడాల పున్నమ్మ సైదులు, వట్టాల శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.



## తప్పనిసరిగా పంటనమోదు

**ప్రజాపక్షం/తుర్కపల్లి** : ప్రతి రైతు పంట నమోదు చేసుకోవడం తప్పనిసరి అని, మండల వ్యవసాయశాఖ అధికారిని శ్రీఉమా అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో డిసిఎస్ సర్వేలో భాగంగా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంట నమోదు తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలను పరిశీలించి, నమోదు చేసిన వివరాలను తనిఖీ చేసి మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో డిసిఎస్ సర్వే పూర్తికావొచ్చిందని, వాలంటీర్లు పూర్తి సర్వే చేసి వేరిఫై చేస్తున్నారని తెలిపారు. ఏఈవో లు కావ్య, జెస్సి, డిసిఎస్ వాలంటీర్ భాస్కర్ పాల్గొన్నారు.





## రామాలయం ఇఓగా శరత్‌చంద్ర బాధ్యతల స్వీకరణ

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలోని వేంచేసిన శ్రీ సీతరామచంద్రస్వామి ఆలయం ఈవోగా శరత్‌చంద్ర గురువారం బాధ్యతలు స్వీకరించారు. పదేళ్లపాటు సేవలందించిన గుజ్జుల కొండారెడ్డి బదిలీపై కల్లేపల్లి ఈవోగా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ట్రస్టు ప్రధాన అర్చకులు, సిబ్బంది ఆయనను ఘనంగా శాలువాతో సత్కరించి వీడ్కోలు పలికారు. అనంతరం శ్రీసీతరామచంద్రస్వామి ఆలయం నూతన ఈవోగా బాధ్యతలు స్వీకరించిన మరింగంటి శరత్‌చంద్రకు ఆలయ ట్రస్టిలు, అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికి శాలువాతో సత్కరించి ఆయనను అభినందించారు. ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సేవలు అందించడంలో సమన్వయంతో పనిచేయాలని పలువురు ఆకాంక్షించారు.ధర్మకర్తలు స్నానాచార్యులు, ము డంబ రామకృష్ణమాచార్యులు, జగన్నాధచార్యులు, శ్రీనివాసచార్య లు, అర్చకులు భాస్కరచార్యులు, మురళి కృష్ణమాచార్యులు, బూ రుగడ్డ ఈవో లక్ష్మణరావు, లింగగిరి ఈవో కొండారెడ్డి పాల్గొన్నారు.

## ఆధారాలతో సహా ఫిర్యాదు చేశాం



**ప్రజాపక్షం/మర్రిగూడ:** శివన్నగూడెం రైతు సేవా సహకార సంఘంలో నెలకొన్న వివాదంపై ఆ సంఘం డైరెక్టర్ దామెర సత్తమ్మ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.ఈ నెల 5న సోమవారం మర్రిగూడ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో తాము ఆధారాలతోనే ఫిర్యాదు చేశామని స్పష్టం చేశారు. గురువారం పలు దినపత్రికల్లో వెలువడిన వార్తల్లో వాస్తవం లేదని చైర్మన్ పేర్కొనడం విడ్డూరంగా ఉందని ఆమె విమర్శించారు. చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకే చైర్మన్ రొటీన్ ప్రకటనలు చేస్తున్నారని ఆరోపించారు.పక్కా ఆధారాలతో బాధ్యులపై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ నిందలను తప్పుదోవ పట్టించే యత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి సమగ్ర విచారణ జరిపించాలని,బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని రైతు సేవా సహకార సంఘం ప్రాధాన్యతను, రైతుల ప్రయోజనాలను కాపాడాలని డిమాండ్ చేశారు.

## లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌తో ఎంజీయూ ఒప్పందం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :ఎమ్మెస్సీ బయో కెమిస్ట్రీ,బయోటెక్నాలజీ,ఫార్మా కెమిస్ట్రీ విద్యార్థులలో నైపుణ్యాల పెంపునకు లైఫ్ సైన్సెస్ సెక్టార్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థతో మహాత్మా గాంధీ యూనివర్సిటీ (ఎంజీయూ) గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ డైరెక్టర్ డా.తిరుమల మాట్లాడుతూ ఒప్పందం ప్రకారం మార్కెట్ అవసరాలకు అనుగుణంగా మైక్రోబయాలజిస్ట్, క్వాలిటీ కంట్రోల్, ప్రొడక్షన్ మెషిన్ ఆపరేటర్, స్టెరైల్ ఫార్ములేషన్స్ విభాగాల్లో విద్యార్థులకు శిక్షణ అందిస్తారని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా ఆధునాతన సాంకేతికత, పరిశోధనలపై అవగాహన పెరిగి ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని అన్నారు.కార్యక్రమంలో ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్,రిజిస్ట్రార్ ఆచార్య కొప్పుల అంజిరెడ్డి,డాక్టర్ తిరుమల,డాక్టర్ మిర్యాల రమేష్,అశ్విని,సంస్థ ప్రతినిధి కుమారస్వామి పాల్గొన్నారు.





## 4 గ్రామాలకు క్షయ రహిత గ్రామాలుగా గుర్తింపు

**ప్రజాపక్షం/చండూరు:** క్షయ వ్యాధి నిర్మూలనలో భాగంగా చండూరు మండలంలోని నాలుగు గ్రామాలను క్షయ రహిత గ్రామాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆయా గ్రామాల సర్పంచ్ లు అవార్డులను అందుకున్నారు. క్షయ వ్యాధి నియంత్రణ నిర్మూలనకు గ్రామస్థాయిలో చేపట్టిన చర్యలు ,ప్రజల్లో అవగాహన కల్పించడం అను మానితులను గుర్తించి వైద్య పరీక్షలు చేయించడం వంటి కార్యక్రమాలలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ఈ గ్రామాలకు గుర్తింపు లభించింది. ఈ సందర్భంగా కస్తాల సర్పంచ్ లేదన్న సత్యం, బంగారిగడ్డ సర్పంచ్ బోయపల్లి సునీత , గుండ్రపల్లి సర్పంచ్ ఉజ్జిని ఉషా, , తాస్కానిగూడెం సర్పంచ్ కలెక్టర్ బడుగు చంద్రశేఖర్ చేతుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రేమ్‌కరణ్ రెడ్డి, ఎమ్మెల్యే శంకర్ నాయక్ , జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు , వివిధ శాఖల అధికారులు , ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పిల్లల ఆరోగ్యం, ఎదుగుదల లోపాలను తల్లులు గుర్తించాలి

**ప్రజాపక్షం/గుండాల;** పిల్లల మానసిక ఎదుగుదల లోపాలను తల్లులు గుర్తించాలని, తల్లులు పిల్లల విషయంలో పూర్తి అవగాహనతో మసులుకోవాలని ఐసిడిఎస్ సిడిపివో నాజీ తెలిపారు. గురువారం మండల పరిధిలోని అనంతారం గ్రామంలో ఏర్పాటు చేసిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలోని గర్భిణీలు, బాలింతలు సరైన పోషకాహారం తీసుకోకపోవడంతో ఆరోగ్య సమస్యలు వస్తున్నాయన్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ వినోద్‌కుమార్, వార్డు సభ్యులు రమేష్, రజినకుమారి, సూపర్‌వైజర్ యాకోషాబేగం, పంచాయతీ కార్యదర్శి దయాకర్ రెడ్డి, ఏఎన్ఎం రజియ, పద్మ, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, రేణుక, ఉప్పలమ్మ, ఆశాలు నజమా, సరిత, గర్భిణీలు, బాలింతలు పాల్గొన్నారు.

## రైతులకు పంటల సస్యరక్షణపై అవగాహన...

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం పత్తి, వరి ప్రధాన పంటల్లో చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవికే శాస్త్రవేత్త డా. రాములమ్మ రైతులతో పత్తి, వరి పంట్లలో ప్రస్తుతం కనిపిస్తున్న పురుగు, తెగుళ్ల సమస్యలపై సమగ్రంగా చర్చించారు. వరి, పత్తి పంటల్లో నల్లి వంటి పురుగుల నివారణకు తీసుకోవాల్సిన సమగ్ర సస్యరక్షణ చర్యలు, అవసరమైన పురుగుమందుల ఎంపిక, పిచికారి విధానాలపై రైతులకు వివరించారు. రైతులు తమ పొలాల్లో ఎదుర్కొంటున్న సమస్యలను శాస్త్రవేత్తల దృష్టికి తీసుకురాగా వటిపై డా. రాములమ్మ సమాధానాలు, తగిన సూచనలు అందించారు. అనంతరం పత్తి, వరి పంట్లలో సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించేందుకు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఎంఏవో రెహానా, వ్యవసాయ విస్తరణ అధికారులు, సర్పంచ్ రవి, రైతులు, కేవికే శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.



# మహిళా సాధికారతకు కృషి

**ప్రజాపక్షం/ చింతపల్లి :** మహిళలకు సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా, మానసికంగా స్వయంసమృద్ధిని సాధించేందుకు అవసరమైన హక్కులు, అవకాశాలు, స్వతంత్రతను కల్పించడం కోసం కాంగ్రెస్ పార్టీ, రాష్ట్ర ప్రభుత్వం ముందుండి కృషి చేస్తుందని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలునాయక్ అన్నారు. మండల పరిధిలోని గొడకొండ్ల వెంకటేశ్వరనగర్, ధైర్యపురితాండలో గురువారం మహిళా సమాఖ్య భవనాలను ప్రారంభించారు. అదేవిధంగా గొల్లపల్లి గ్రామంలో ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులనుండి సిసిరోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితో పాటు మహిళా సంఘాలను బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని బాలునాయక్ అన్నారు. గ్రామాల్లో రోడ్ల అభివృద్ధి, ప్రజల రోజువారి జీవనానికి ఎంతో కీలకమన్నారు. ప్రజలు, రైతులు, విద్యార్థులు వాహనదారులు సురక్షితంగా రాకపోకలు సాగించేందుకు మెరుగైన



రహదారి సౌకర్యాలు అవసరమని తెలిపారు. గ్రామాల అభివృద్ధి, మహిళల సంక్షేమం, పేదల ఆర్థిక పురోగతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రాధాన్యతలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి, జాటావత్ హరినాయక్, అంగిరేకుల నాగభూషణ్, ముచ్చర్లగిరి, ఎరుకల వెంకటయ్యగౌడ్, కాయితి జితేందర్‌రెడ్డి, పవన్‌కుమార్, కాశగోనివెంకటయ్య, యాచారం యాదిగౌడ్, శ్రీనుగౌడ్, వాంకుడోత్ అనితదాసు పాల్గొన్నారు.

## ఛాతీ వ్యాధులకు థొరాసిక్ సర్జరీ ద్వారా సమర్థవంతమైన చికిత్స



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఊపిరితిత్తులు,అన్నవాహిక, ఛాతీ మధ్య భాగం,డయాఫ్రమ్,ఛాతీ గోడకు వచ్చే వ్యాధులకు యశోద హాస్పిటల్స్, సోమాజిగూడలో అత్యాధునిక విధానాల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నామని థొరాసిక్ సర్జన్ డాక్టర్ రోహన్ రెడ్డి తెలిపారు.గురువారం నల్లగొండలోని వెంకటేశ్వర రెసిడెన్సీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంక్లిష్టమైన ఛాతీ వ్యాధులకు మినిమల్లీ ఇన్వాసివ్, రోబోటిక్ సహాయంతో చేసే సర్జరీల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తున్నామన్నారు.ఊపిరితిత్తుల క్యాన్సర్,అన్నవాహిక క్యాన్సర్, ఛాతీలో కణితులు వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెరుగుతోందని, వ్యాధిని త్వరగా గుర్తించడం వల్ల సురక్షితమైన ఆపరేషన్లు చేయగలుగుతున్నామని చెప్పారు.థొరాసిక్ సర్జరీ అంటే గుండెను మినహాయించి ఛాతీలో వచ్చే ఇతర వ్యాధులకు చేసే ప్రత్యేక ఆపరేషన్ అని, గతంలో ఛాతీని పూర్తిగా తెరిచి చేసే ఓపెన్ సర్జరీ తప్పనిసరి అయినా ఇప్పుడు వీడియో కెమెరా, రోబోటిక్ సహాయంతో చిన్న రంధ్రం లేదా కోతతోనే ఆపరేషన్లు చేస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ వినోద్ పాల్గొన్నారు.

## కాకతీయ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** తెలంగాణ పండుగలు ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణకు అవి ఎంతో ప్రాధాన్యతనిస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ నరసింహారెడ్డి అన్నారు.బతుకమ్మ ఉత్సవాలను పురస్కరించుకొని గురువారం నల్లగొండలోని కాకతీయ డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో విద్యార్థులు,అధ్యాపకులు తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించేలా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు సంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను అలంకరించి, బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్నారు.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెలంగాణ



పండుగలు ప్రకృతితో ముడిపడి ఉన్నాయని, పర్యావరణ పరిరక్షణకు అవి ఎంతో ప్రాధాన్యతనిస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు స్వప్న,మానస,భవాని,యామిని,అంజలి తదితరులు పాల్గొన్నారు.

## టీబీ రహిత గ్రామంగా ఎర్రగండ్లపల్లి

**ప్రజాపక్షం/మర్రిగూడ :** మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామాన్ని టీబీ రహిత గ్రామంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఎంపిక చేసింది.గురువారం కలెక్టర్ ఇ.చంద్రశేఖర్ చేతుల మీదుగా పంచాయతీ అవార్డు,ప్రశంసా పత్రాన్ని సర్పంచ్ వల్లముల సంతోష్ యాదవ్ కు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన టీబీ రహిత గ్రామ పంచాయతీగా కృషి చేసిన వైద్య సిబ్బందికి,పంచాయతీ వర్గర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



## అవార్డుల ప్రదానం...

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలంలోని చెరుకుపల్లి, ఖానాపూర్, బొగ్గులదోన, జేత్యతండా గ్రామాలు టీబీ ముక్త్ భారత్ గ్రామాలుగా ఎంపికయ్యాయి. గురువారం నల్గొండలో చెరుకుపల్లి సర్పంచ్ రామచంద్రయ్య, ఖానాపూర్ సర్పంచ్ తిప్పర్తి ప్రతిమ విజేందర్‌రెడ్డి, బొగ్గులదోన సర్పంచ్ శ్రీవాణి, జేత్యతండా సర్పంచ్ శంకర్ జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా ప్రతాలను పొందారు.





## ధీశాలి బాలగోపాల్

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** చిత్రం: 01ఎంఎల్జీ 256: మానవ హక్కుల వేదిక వ్యవస్థాపక నాయకుడు, ప్రముఖ న్యాయవాది బాలగోపాల్ 17వ వర్థంతి సందర్భంగా గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద వివిధ ప్రజా సంఘాల ప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మాట్లాడారు. బాలగోపాల్ తన జీవితాంతం దేశంలో అణచివేతకు గురైన పేద వర్గాలు, ఆదివాసీలు, దళితులు, ముస్లిం మైనారిటీలు, కాశ్మీర్ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం పోరాడారని గుర్తుచేశారు. హక్కుల ఉద్యమ నాయకుడిగా అనేకసార్లు కాశ్మీర్ పర్యటించి అక్కడి పరిస్థితులపై అధ్యయనం చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల ఐక్యత వేదిక ప్రతినిధి బీసం రామయ్య, తెలంగాణ విద్యావంతుల వేదిక నాయకులు హరి, సామాజిక కార్యకర్త డాక్టర్ రాజు, బాలస్వామి, నారాయణరెడ్డి, శర్మ, హాఫీజ్, కుందశ్రీను పాల్గొన్నారు.

## నోట్ పుస్తకాలు, విద్యా సామాగ్రి పంపిణీ



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నల్గొండ జిల్లా నేరేడుగొమ్ముమండలం పెద్దమునిగల్ ప్రాథమిక పాఠశాలలో బ్యాంక్ ఆఫ్ ఇండియా పెద్దమునిగల్ బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, విద్యా సామాగ్రిని పంపిణీ చేశారు. బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న స్టార్ బాండింగ్ టీఎస్ఆర్ ప్రోగ్రాంలో భాగంగా బ్యాంక్ మేనేజర్ అనిల్, అసిస్టెంట్ మేనేజర్ రాజ్‌కుమార్, సిబ్బంది కీర్తి, జానయ్య, మణికంఠ, సాంబయ్యల ఆధ్వర్యంలో సుమారు రూ. 8వేల విలువైన నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, క్రేయాన్ ప్యాకెట్లను 80 మంది విద్యార్థులకు అందజేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాచూరి జానకిరామయ్య, ఉపాధ్యాయులు నరేందర్, సైదులు పాల్గొన్నారు.

## టీబీ రహిత గ్రామాలుగా మూడు పంచాయతీలు



**ప్రజాపక్షం/నకిరేకల్:** క్షయ వ్యాధి నిర్మూలనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నడిగూడెం,వల్లభాపురం,గొల్లగూడెం గ్రామ పంచాయతీలు టీబీ రహిత గ్రామాలుగా ఎంపికయ్యాయి.కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ౹టీబీ ముక్త భారత్ అభియాన్‌లో భాగంగా ఈ మూడు గ్రామాలు ఈ ఘనత సాధించాయి.గురువారం నల్లగొండలోని ఉదయాదిత్య భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ఆయా గ్రామాల సర్పంచులు,ఆరోగ్యశాఖ సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నకిరేకల్ ఎంపీడీవో జి.బ్రహ్మచారి,సర్పంచులు రాచకొండ రాజేందర్,మోర్సు శ్రీను,చిర్రబోయిన లక్ష్మీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## పోషణమాసం

**ప్రజాపక్షం/డిండి;** ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని పడమటితండా అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెక్టార్ సూపర్‌వైజర్ ఎం. రేణుక హాజరై గర్భిణీ స్త్రీలు గర్భం దాల్చిన దగ్గరున్నుంచి డెలివరి అయిన ఆరు నెలల వరకు అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్య లక్ష్మీ పథకం ద్వారా భోజనం అందించడం, ఆరోగ్య పోషణ సలహాలు సూచనలు తెలిపారు.

# సిఇసి జ్ఞానేష్‌కుమార్ రాజీనామా చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగ వ్యవస్థలను పూర్తిగా ఖూనీ చేస్తోందని మిర్యాలగూడ శాసనసభ్యుడు బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని అక్రమంగా అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మిర్యాలగూడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ర్యాలీలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, యువజన నాయకులు, బిఎల్ఆర్ బ్రదర్స్ సభ్యులు, పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి** : మండల కేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాసర్ల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గురువారం నిరసన చేపట్టి మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. డిసిసి ప్రధాన కార్యదర్శి వేమన్‌రెడ్డి, ఐఎన్‌టియూసి జిల్లా ఉపాధ్యక్షుడు మేకల రాజేందర్‌రెడ్డి, మంగ్య నా యక్, కాంగ్రెస్ సర్పంచ్‌లు రాజునాయక్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ గురువారం మండల కేంద్రంలో సుభాష్ సెంటర్ వద్ద ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పున్న జగన్మోహన్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బిక్షం రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, పూస బాలకిషన్, అబ్రహం కుమార్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నూతనకల్ :** ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన చేపట్టిన లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీతో పాటు ఇండియా కూటమి ఎంపిలపై ఢిల్లీ పోలీసుల దాడి చేయటాన్ని నిరసిస్తూ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కట్ట మల్లారెడ్డి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో బ్లాక్‌డే, ధర్నా, నిరసన ర్యాలీని నిర్వహించారు. సర్పంచ్‌లు అనంతుల శ్రీనివాస్, శంకర్ నాయక్, గుగులోతు కృష్ణా నాయక్, జటంగి గణేష్ యాదవ్, లావుడ్యా సుధాకర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/అర్వపల్లి :** సిఈసి జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న



రాహుల్ గాంధీని అరెస్టు చేయడం నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు మండల కేంద్రంలో నిరసన తెలియజేసి ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుడిపల్లి మధుకర్ రెడ్డి, వెల్పుల రమేష్, బీరవోలు విక్రమ్ రెడ్డి, కొరపిడత అవిలయ్య యాదవ్, సిగ నజీర్ గౌడ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి:** రాహుల్ గాంధీ చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా,ఆయన అరెస్టును నిరసిస్తూ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ శ్రేణులు కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం అధికారి జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాయం శ్యాంసుందర్ రెడ్డి, పాశం శ్రీనివాస్ రెడ్డి,బత్తుల ఉషయ్య గౌడ్, సట్టు సత్తయ్య, జెరిపోతుల భరత్ గౌడ్,గడ్డం పశుపతి,బోడ శంకర్, జిల్లా మహేష్, మట్టపల్లి నాగరాజు,కిట్టు,జిల్లా పృథ్వి, ఎస్.కే.సమద్ తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మర్రిగూడ** :కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలిని నిరసిస్తూ, ప్రజాస్వామ్యాన్ని,ఓటు హక్కును పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ, టీపీసీసీ, ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి పిలుపు మేరకు మర్రిగూడ మండల కేంద్రంలో గురువారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ వైస్ చైర్మన్ నక్క శ్రీనివాస్,యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొండాల్ అల్వాల్ రెడ్డి పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : మండల కేంద్రంలో చీఫ్ ఎలక్షన్ కమిషన్ చేస్తున్న ఓటు చోరీపై పోరాటం చేస్తున్న పార్లమెంట్ ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ ల అక్రమ అరెస్టుకు నిరసనగా మండల కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కే శ్రీను నాయక్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు దోనూరి జైపాల్ రెడ్డి, కుక్కల నరసింహా, ఉప్పల లింగస్వామి, మాజీ ఎంపీపీ బుజ్జి నాయక్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/మునుగోడు** :ప్రజాస్వామ్యంలో ప్రజల ప్రాథమిక హక్కైన ఓటు పరిరక్షణ కోసం ప్రశ్నిస్తూ ఢిల్లీలో శాంతియుతంగా ఆందోళన చేపట్టిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను అరెస్టు చేయడం సరికాదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు భీమనపల్లి సైదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జాజుల అంజయ్య గౌడ్,జిల్లా నాయకులు బూడిద లింగయ్య





యాదవ్,చండూరు వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ కుంభం చెన్నారెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాల్వాయి చెన్నారెడ్డి,మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ అన్వర్ పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నాంపల్లి** : ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను రద్దు చేయాలని,కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీల అక్రమ అరెస్టులను ఖండిస్తూ నాంపల్లిలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించారు. కార్యక్రమంలో పూల వెంకటయ్య,ఎర్రెడ్ల నారాయణరెడ్డి,కలకొండ దుర్గయ్య,వీరమల్ల సందీప్ గౌడ్,మేకల రమేష్,సుదన బోయిన పర్వతాలు, జంపాల సైదులు, అంగిరేకుల పాండు, ఈద శేఖర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/చండూరు:** రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తో పాటు ఇండియా కూటమి నాయకుల అరెస్టును ఖండిస్తూ చండూరులో కాంగ్రేస్ నాయకులు గురువారం రాస్తారోకో చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ భూతరాజు దశరథ , పార్టీ జిల్లా నాయకులు కాసాల జనార్దన్ రెడ్డి, కోడి వెంకన్న, పందిరి రాధ , కారింగు పల్లవి , ఫరీఫ్ , పన్నాల లింగయ్య , గండు వెంకట్ గౌడ్ , ఇరిగి రాజు , సుంకరి శివనారి కారింగు రాంమూర్తి, ఇరిగి వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్** : ఎన్నికల కమిషనర్‌ను తొలగించాలని, సర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో రాహుల్ గాంధీ,యువత చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా పట్టణంలోని కాంగ్రెస్ శ్రేణులు భారీ ధర్నా నిర్వహించాయి. నంతరం ఎన్నికల కమిషనర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. నియోజకవర్గ, మండల కాంగ్రెస్ నేతలు,యూత్ కాంగ్రెస్, మహిళా విభాగం ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చిట్యాలః** జాతీయ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ అరెస్టను నిరసిస్తూ నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలో గురువారం రోజున కాంగ్రెస్ శ్రేణులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పందరి గీతారమేష్, వైస్ చైర్మన్ గుండెబోయిన లక్ష్మి సైదులు, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు కాటం వెంకటేశంపాల్గొన్నారు.





## విద్యార్థులు కంప్యూటర్ నైపుణ్యాలు పెంచుకోవాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** : భవిష్యత్తులో మంచి ఉద్యోగం సాధించాలన్నా,సొంత కాళ్లపై నిలబడాలన్నా విద్యార్థులు బాగా చదువుకోవడంతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు.గురువారం రాత్రి పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ బీసీ బాలుర కళాశాల ఏ,బీ హాస్టళ్లను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.టాయిలెట్లు,డైనింగ్, కిచెన్,స్టోర్ రూమ్,తరగతి గదులు, డార్మెటరీలను పరిశీలించారు.విద్యార్థులతో మాట్లాడి హాస్టల్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.కిచెన్ లో వంటలను పరిశీలించి మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా లేదా అని ఆరా తీశారు.ప్రతి తరగతి గది,డార్మెటరీలో ఫ్యాన్లు,లైట్లు ఉండేలా చూడాలని, నాణ్యమైన భోజనం అందించాలని, కాలం చెల్లిన సరుకులు వాడవద్దని వార్డెన్లను ఆదేశించారు. తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని, హాస్టల్ ఆవరణలో చీకటిగా ఉండటాన్ని గమనించి వెంటనే మున్సిపల్ కమిషనర్ తో మాట్లాడి లైట్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

## బిఆర్ఏఓలో 13 వరకు అడ్మిషన్లు గడువు పెంచే అవకాశం లేదు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్** :డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2026/27 విద్యా సంవత్సర ప్రవేశాల గడువు ఈ నెల 13వ తేదీ వరకేనని, ఇదే చివరి అవకాశమని, మళ్లీ గడువు పెంచే అవకాశం లేదని నల్లగొండ రీజినల్ కోఆర్డినేషన్ సెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ బొజ్జ అనిల్ కుమార్ తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ బీఏ, బీకాం, బీఎస్సీ, ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, బీఎల్ఐఎస్సీ,ఎంఎల్ఐఎస్సీ, డిప్లొమా కోర్సులతో పాటు కొత్తగా ఎంఏ ఎడ్యుకేషన్, ఎంఏ ఎడ్యుకేషన్ (స్కూల్ అడ్మినిస్ట్రేషన్),ఎంఎస్‌డబ్ల్యూ,ఎమ్మెస్సీ జాగ్రఫీ, ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్, ఎమ్మెస్సీ స్టాటిస్టిక్స్, ఎమ్మెస్సీ డేటా సైన్స్ కోర్సులను ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.అలాగే ఆన్ లైన్ విధానంలో బీకాం (తెలుగు, ఇంగ్లీష్ మీడియం), ఎంఏ తెలుగు, ఎంకాం, ఎంబీఏ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.అర్హులైన విద్యార్థులు వెబ్ సైట్ లోద్వారా దరఖాస్తు చేసుకుని, తమ స్టడీ సెంటర్‌ను సంప్రదించాలని సూచించారు.

## తొలగించిన ఓట్లను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/వేములపల్లి:** ఈ దేశంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రేగటి రవీందర్ రెడ్డి అన్నారు. ఓటరు జాబితా ప్రక్రియ వెంటనే నిలిపివేయడంతో పాటు అక్రమంగా తొలగించిన ఓట్లన్నీటిని తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ గురువారం అద్దంకి నార్కెట్పల్లి ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోమండల వర్కింగ్ ప్రెసిడెంట్ మండల నాయకులు ఎల్లారెడ్డి,గంగి,శ్రీనివాస్ పెద్ద వెంకన్న,బుసిరెడ్డి,వెంకటరెడ్డి,పళ్ళ వెంకన్న,బుర్రి,వెంకటరెడ్డి,దైదగిరి,బొంగర్ల,వినోద్,సోయల్ ఖాన్,నవీదు,హాజీ పాల్గొన్నారు.

